క్లుప్తంగా

వడదెబ్బ నివారణపై అవగాహన


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: ప్రతి ఒక్కరూ ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. శనివారం మండలంలో ని కట్టకిందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్ పాల్గొన్నారు.

కేసు నమోదు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో పది రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మేదరవీధిలో నివాసం ఉంటున్న నారాయణలాల్(74) ఈ నెల 8వ తేదీ రాత్రి మెడికల్ షాప్‌లో మందులు కొనుగోలు చేసేందుకు బస్టాండ్ వద్ద రోడ్డు దాడుతుండగా పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నారాయణలాల్ తల, రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. శనివారం నారాయణలాల్ కుమారుడు ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు.

అర్జీలను పరిష్కరించండి


మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ అనుపమ

పూతలపట్టు(కాణిపాకం): ప్రజల ద్వారా వచ్చే అర్జీలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ అనుపమ ఆదేశించారు. శనివారం ఆమె పూతలపట్టు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని సూచించారు. ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని ఆదేశించారు.

లింగ నిర్ధారణ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో నిఘా వ్యవస్థ లోపించడంతో లింగనిర్ధారణ పరీక్షలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. చిత్తూరులో లింగనిర్ధారణ పరీక్షలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్వయంగా జిల్లా కలెక్టరే లింగ నిర్ధారణ చేస్తున్న సెంటర్లను తనిఖీ చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అరకొరగా సౌకర్యాలు ఉండడంతో ప్రైవేట్ ఆస్పత్రుల పంట పండుతోందన్నారు. ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా లేకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య, డ్రగ్స్ అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఇళ్ల ముంగిటకే వైద్యసేవలు


గుడిపాల: రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ వైద్యసేవలు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా అందిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య అన్నారు. శనివారం పెద్దిశెట్టిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోరి బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో 61 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసేవలను అందించారు. వైద్యసిబ్బంది ఇందు, నిరోషా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆలయంలో అఖండ హరి నామస్మరణం

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వైభవంగా హరినామస్మరణ భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం స్వామి వారి నామస్మరణతో మారుమోగింది. ప్రతి శనివారం ప్రత్యేక భజన బృందం వారిచే నిర్వహించే ఈ కార్యక్రమం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని అర్చకులు తెలిపారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన నిలయాలు

గ్రంథాలయాలు.. జ్ఞాన సముపార్జనకు నిలయాలు. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేసుకోకుండా.. విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా గ్రంథాలయ సంస్థ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. వారిలో సృజనాత్మకతను పెంపొందించేలా సరికొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. స్పోకెన్ ఇంగ్లిష్.. గణిత ఫార్ములాలు.. పద్యాలు.. బొమ్మలు వేయడం.. ఇలా పలు రకాల అంశాలకు సంబంధించి గ్రంథాయాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.


శిక్షణకు హాజరైన విద్యార్థులు

- వేసవి సెలవుల్లో సమయం వృథా కాకుండా విద్యార్థులకు పలు అంశాలపై తర్ఫీదు
- జ్ఞాన సముపార్జనలో బాలబాలికలు
- 45 రోజుల పాటు పలు నైపుణ్యాల్లో శిక్షణ
- గ్రంథాలయశాఖ చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి స్పందన

ఐరాల: పుస్తక పఠనంతో జ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఒకప్పుడు గ్రంథాలయాలకు పాఠకుల తాకిడి ఎక్కువగా ఉండేది. ఉదయం, సాయంత్రం విధిగా గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేసేవారు. రానురాను ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రస్తుతం సెల్‌ఫోన్లు రావడం, సోషల్ మీడియా విస్తృతి పెరిగిన నేపథ్యంలో పుస్తక పఠనం పట్ల పెద్దలకు, చిన్నారులకు సైతం ఆసక్తి తగ్గుతోంది. దీని వల్ల గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. వేసవిలో ప్రభుత్వం గ్రంథాలయాల ద్వారా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు మే 28వ తేదీ నుంచి జూన్ 6 వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. వేసవిలో ప్రత్యేకంగా పిల్లల కోసం విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నాయి. సెలవుల్లో ఆటపాటలతో గడిపే చిన్నారులకు చదువుతో పాటు వివిధ రకాల అంశాలపై శిక్షణతో వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీస్తున్నాయి. స్థానిక గ్రంథాలయంలో 45 రోజుల పాటు జరిగే ఈ తరగతుల్లో చిన్నారులకు తెలుగు పద్యాలు, చందమామ కథలు, శతక పద్యాలు, చిత్రలేఖనం, గణిత సూత్రాలు, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్ తరగతులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా చిన్నారులకు యోగా, ధ్యానం, క్యారమ్స్, చెస్, తదితర అంశాల్లో మెళకువలు నేర్పిస్తున్నారు. అలాగే వారాంతపు పరీక్షలు నిర్వహించి, వాటిలో ప్రతిభ కనబరచిన వారికి పుస్తకాలు, పెన్నులు బహుమతులుగా అందజేసి ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంటర్నెట్ ప్రభావం అధికంగా ఉండడంతో చిన్నారులు ఆన్‌లైన్ గేమ్‌ల బారిన పడుతున్నారు. ఈ తరుణంలో పుస్తక పఠనంతో వారికి విజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు చిన్నారులతో కళకళలాడుతున్నాయి.

తల్లిదండ్రుల ప్రోత్సాహం..

వేసవి శిక్షణ శిబిరాలను పిల్లల తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ 4 గంటల పాటు ఆయా గ్రంథాలయాల్లో సుమారు 20 నుంచి 40 మంది విద్యార్థులు పలు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. చదువుతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించే యోగా శిక్షణ కూడా ఇస్తున్నారు. చిత్రలేఖనం, పేపర్‌తో క్రాఫ్ట్ బొమ్మల తయారీపై అవగాహన కల్పిస్తున్నారు. శిక్షణకు వచ్చిన విద్యార్థులకు తాగునీరు, శీతల పానీయాలు, స్నాక్స్ అందిస్తున్నారు.


ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

పుస్తక పఠనంతో మేధోశక్తి

ఐరాల: పుస్తక పఠనంతో మేధోశక్తి వస్తుందని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత తెలిపారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు డ్రాయింగ్, భక్తిపాటలు నేర్పించడం, కథలు చదివించడం, పద్యాలు కంటస్థం చేయించడంపై శిక్షణ ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలు, నీటి సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎండ తీవ్రతను ఏవిధంగా అధిగమించాలనే వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.


నీతి కథలు చదవడంపై శిక్షణ ఇస్తున్న గ్రంథాలయాధికారి సుజాత

ఆసక్తి చూపుతున్నారు..



వేసవి శిక్షణ తరగతులపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. చదువుతో పాటు ఇతర అంశాల్లో ఇస్తున్న శిక్షణ ఇస్తుండడంతో వారిలో సృజనాత్మకత, పోటీతత్వం పెరుగుతోంది. గణిత సూత్రాల్లో మెళకువలు, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకోవడం వల్ల పోటీ పరీక్షల్లో సులభంగా విజయం సాధించవచ్చు. విద్యార్థులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. – సుజాత, గ్రంథాలయాధికారి, ఐరాల

శిక్షణ బాగుంది



వేసవి తరగతుల్లో చదువుతో పాటు యోగా, బొమ్మల తయారీ, చిత్రలేఖనం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. నాతో పాటు స్నేహితులను కూడా తరగతులకు తీసుకువెళ్తున్నాను. వేసవి సెలవుల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ హాజరవుతున్నాను. యోగాలోని పలు ఆసనాలను, సూర్యనమస్కారాలను ఇక్కడ నేర్పిస్తున్నారు. – కుబ్రా, ఆరో తరగతి, ఐరాల

రేపటి నుంచి గంగజాతర

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురంలో వెలసిన శక్తి స్వరూపిణి వజ్రాలపురం బోయకొండ గంగమ్మ జాతర ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు శనివారం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు అమ్మవారి 26వ జాతర మహోత్సవాన్ని మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. జాతర కార్యక్రమంలో భాగంగా 19వ తేదీ సోమవారం అభిషేకం, కలశస్థాపన, చండీహోమం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నారు. 20వ తేదీ మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అంబలి, పొంగళ్లు సమర్పణ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 7 గంటలకు పాటల కచేరీ, 21వ తేదీ బుధవారం ఉదయం అమ్మవారి ప్రత్యేక అలంకరణ, పూజలు ఉంటాయన్నారు. సాయంత్రం 4 గంటలకు అమ్మవారిని విశేషంగా అలంకరించి వెండితేరుపై కొలువుదీర్చి అమ్మవారి సన్నిధి నుంచి ఊరేగింపు, నిమజ్జనం చేపట్టనున్నట్లు వివరించారు. జాతరకు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

ఉచిత పశువైద్య శిబిరం


పశువైద్య శిబిరంలో విద్యార్థులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా చిత్తూరు మండలంలోని చెర్లోపల్లిలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాడి పెంపకంలో ఎదుర్కొంటున్న సమస్యలు, కష్టాలు, లాభాలను పాడి రైతులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వారీగా వ్యాపించే వ్యాధులను రైతుల ద్వారా తెలుసుకున్నారు. వాటి నివారణకు తీసుకుంటున్న ఆరోగ్య జాగ్రత్తలు, వైద్య సేవలపై ఆరా తీశారు. కాగా ఈ శిబిరంలో 150 పైగా ఆవులకు వైద్యం చేశారు. అలాగే లేగ దూడలకు డీవార్మింగ్ చేయించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ చాణక్య, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి శైలజ, డా.ప్రశాంతి పాల్గొన్నారు.

మురుగునీటి నిల్వలతో వ్యాధులు


కాలువను పరిశీలిస్తున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: మురుగునీటి నిల్వతో వ్యాధులు ప్రబలుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. శనివారం స్థానిక 44వ డివిజన్ రంగాచారివీధిలో కాలువలో నిలిచిన మురుగునీటిని చూసి మాట్లాడారు. స్థానిక ఈశ్వరగుడి వీధి నుంచి రంగాచారివీధి వరకు డ్రైనేజ్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. అయితే డ్రైనేజీలో మురుగు నీరు, ఇతర వ్యర్థ పదార్థాలు నిల్వ ఉండడంతో దోమలు చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. పలు నివాసాలకు సెప్టిక్ ట్యాంక్ లేకపోవడంతో వ్యర్థాలు కాలువలోకి వదులుతున్నారని, దీంతో ప్రాంతమంతా దుర్వాసన వస్తుందన్నారు. వీధిలో తాగు నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, యుద్ధ ప్రాతిపదికన కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని కోరారు.

ఎస్‌ఈ కార్యాలయంలో పరిసరాలు శుభ్రం

చిత్తూరు కార్పొరేషన్: స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ట్రాన్స్‌కో కార్యాలయాల్లో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అందులో భాగంగా ఎస్‌ఈ కార్యాలయం ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. వ్యర్థాలను బయటపడేశారు. అనంతరం కార్యాలయ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ జగదీష్, పీఓ రెడ్డెప్ప సిబ్బంది పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఈఈ, ఏఓ

పారిశుద్ధ్యం మెరుగుపడాలి

తవణంపల్లె: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు సచివాలయ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ తెలిపారు. శనివారం మండల కేంద్రమైన తవణంపల్లె స్వర్ణాంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీపీఓతోపాటు ఎంపీడీఓ రాఘవేంద్రరాజు, ఏఓ రెడ్డిబాబు, డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం, సర్పంచ్ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ప్రభుప్రేమకుమారి చేతులు మీదుగా తవణంపల్లెలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. హాజరైన వారికి మజ్జిగ పంపిణీ చేశారు. తవణంపల్లె సచివాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లను సన్మానించారు. టి.పుత్తూరు రోడ్డు కూడలిలో మానవహారం నిర్వహించి పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ సుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది చేత రెవెన్యూ కార్యాలయ ఆవరణంలో పరిసరాలను శుభ్రం చేయించి చెత్తను ట్రాక్టర్ ద్వారా తొలగించారు. దిగువ తడకర పంచాయతీలో సర్పంచ్ గుణవతి, పంచాయతీ కార్యదర్శి సఫియాఅజ్మి ఆధ్వర్యంలో ప్రధాన రహదారికిరువైపులా చెత్త కుప్పలు, ముళ్ల చెట్లను జేసీబీతో తొలగించారు. తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ కే.శవనారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

పూతలపట్టు (కాణిపాకం): ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని డీసీహెచ్‌ఎస్ పద్మాంజలి తెలిపారు. పూతలపట్టు మండలం పి.కొత్తకోట సీహెచ్‌సీ ఆస్పత్రిని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలు, మందులు, మాత్రల నిల్వలపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అదించాలని, విధుల్లో అలసత్వం వద్దన్నారు.

ఉర్దూ పోస్టులు యథావిధిగా కొనసాగించాలి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో ఉర్దూ పోస్టులను యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) చిత్తూరు జిల్లా అధ్యక్షుడు మునీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300 తెలుగు, ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 50 సంవత్సరాలుగా ఉర్దూ టీచర్లు పనిచేస్తున్నారని అన్నారు. ఉర్దూ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సర్‌ప్లస్‌లో ఎలా చూపిస్తారని ఆయన ప్రశ్నించారు. ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను రాత్రికి రాత్రే జీఓలు తెచ్చి ఎలా తొలగిస్తారని మండిపడ్డారు. ఆ పోస్టులన్నీ యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కచ్చితంగా ఆందోళనలు తప్పవని ఆయన హెచ్చరించారు.


మాట్లాడుతున్న మునీర్ అహ్మద్

జనసేన నేతలపై చర్యలు తీసుకోండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సుపై దాడి చేసిన జనసేన నేతలపై చర్యలు తీసుకునేలా చూడాలని ఏపీ నర్సింగ్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు రెడ్డిగంగరాజు, అశోక్, ధరణి, పల్లవి, యుగంధర్ కోరారు. శనివారం వారు చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలిసి వినతి చేశారు. ఈనెల 14వ తేదీ ఐరాల పీహెచ్‌సీలో నైట్ డ్యూటీ చేస్తున్న స్టాఫ్ నర్సు శకుంతలపై జనసేన నేతలు దాడి చేశారన్నారు. ఈ దాడిలో శంకుతల, ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఈ విషయంలో బాధితులకు న్యాయం చేస్తూ.. ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది ఉద్యోగ భద్రతతో పాటు రక్షణ కల్పించేలా చూడాలని వినతిలో పేర్కొన్నారు. అనంతరం చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత నర్సును పరామర్శించారు.

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి


మృతి చెందిన నాగయ్య

బంగారుపాళెం: జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా.. నలగాంపల్లె పంచాయతీ కేసీకండ్రిగకు చెందిన నాగయ్య(57)గత రెండేళ్లగా పక్షవాతంతో బాధ పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 14వ తేదీ జీవితంపై విరక్తి చెంది వడిశాకు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. భార్య సుభాషిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.




భూముల వివరాల పరిశీలన

గుడిపాల: అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాల వర్తింపు కోసం రైతులకు సంబంధించిన భూముల వివరాలను తనిఖీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. నారగల్లులో రైతులతో ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకాలు వర్తింపునకు భూముల 1బీ, ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్లతో సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో పరిశీలన చేసుకుని నమోదు చేసుకోవాలన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏఓ మాధవి

రక్తహీనతపై అవగాహన


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

గుడిపాల: కౌమార దశలో రక్తహీనత తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాద్రాక్షి అన్నారు. శనివారం కిశోరి వికాసంలో భాగంగా వసంతాపురం అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలు, కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు. రక్తహీనత నుంచి బయట పడాలంటే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. మహిళా పోలీస్ పావని, ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ వర్కర్ పాల్గొన్నారు.

మనల్ని మనం కాపాడుకుందాం


అవగాహన కల్పిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: వేసవి వేడి నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మేయర్ అముద పిలుపునిచ్చారు. మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మెసానిక్ మైదానం వద్ద రైల్వే గేట్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం ఆవరణలో ×బీట్ ది హీట్ కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వే గేట్ పడినప్పుడు వాహనదారులు ఎండ వేడిమికి ఇబ్బంది పడకుండా గ్రీన్ మ్యాట్‌తో పైకప్పు వేయించారు. వేచి ఉండే వాహనదారులకు మేయర్, కమిషనర్ నరసింహ ప్రసాద్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, ఎంహెచ్‌ఓ డా.లోకేష్ తాగునీరు, ఓఆర్‌ఎస్ నీరు అందించారు. అనంతరం బీఆర్ అంబేడ్కర్ భవనం ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. వేసవి నేపథ్యంలో పక్షులకు నీరు అందించడం కోసం చెట్లలోని కొమ్మలకు మట్టి పాత్రలను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రజాప్రతినిధులు, అధికారులు నీరు పోశారు. అనంతరం భవన నిర్మాణ కూలీలకు వేసవి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నీరు బాగా తాగాలని, నీడలో పనులు చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ నగరంలో 500 మొక్కలు నాటామని, జనం ఎక్కువగా గుమికూడే ప్రాంతాల్లో నీడ ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, సీఎంఎం వెంకటరమణ, కార్పొరేటర్ అశోక్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగరపాలక కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.

‘ఉగ్రవాదం–ప్రగతి నిరోధకం’ కవితకు ప్రశంస


హైదరాబాద్ రవీంద్రభారతిలో షంషీర్‌ఖాన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

బంగారుపాళెం: మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు షంషీర్‌ఖాన్ రాసిన కవితకు ఉత్తమ ప్రశంసపత్రం లభించింది. పహల్గాం కవితా సంకలనంలో ‘పహల్గాం దుర్ఘటన’పై ఆయన రాసిన ‘ఉగ్ర వాదం–ప్రగతి నిరోధకం’ కవిత ప్రచురిత మైంది. శుక్రవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, కరీంనగర్ భవానీ సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రాసిన కవితను పలువురు అభినందించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు.

